సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 5 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.25,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,500, కనిష్టంగా రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.33
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.23, సరాసరిన రూ.28 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
28.8°/18.6°
జిల్లాలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రత, చలి తీవ్రత కొంత తగ్గింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్ల నుంచి తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ టీఎస్ చేతన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఈ నెల 6వ తేదీ (శుక్రవారం) నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఇందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చేతన్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రెవెన్యూ గ్రామంలోనూ సదస్సు నిర్వహించాలని, ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని నమోదు చేసి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సదస్సు ఉద్దేశం ప్రజలకు వివరించి ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ సదస్సుల షెడ్యూల్, వేదిక, సమయం గురించి ముందుగానే ఆయా గ్రామస్తులకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. సదస్సులో పాల్గొనే బృందంలో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్ బోర్డు ప్రతినిధి, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగి, అటవీ శాఖ అధికారి తప్పనిసరిగా ఉండాలన్నారు. సదస్సుల్లో కచ్చితంగా 18 రిజిష్టర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి పిటిషన్‌ను రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడీఈ విజయశాంతి బాయి తదితరులు పాల్గొన్నారు.

పేదల నీడ.. పచ్చ క్రీనీడ

- వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇల్లు బలవంతంగా కూల్చివేత
- పోలీసు బందోబస్తుతో దగ్గరుండి కూల్చివేయించిన అధికారులు
- బాధితులు కాళ్లావేళ్లా పడినా కనికరించని వైనం
- అధికార పార్టీకి దాసోహమవడంపై సర్వత్రా విమర్శలు



వైఎస్సార్ సీపీ నేత భాస్కర్ ఇంటిని కూల్చేందుకు జేసీబీ తీసుకొస్తున్న దృశ్యం

పుట్టపర్తి: జిల్లాలో అధికారులు పక్కా టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నాయకులు చెప్పిందే వేదమన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడానికి స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలో బుధవారం నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిని కూల్చివేయించడమే ఇందుకు నిదర్శనం. పెద్దసంఖ్యలో పోలీసులను బందోబస్తుగా తీసుకొచ్చి మరీ ఈ చర్యకు ఒడిగట్టడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. బాధితులు కాళ్లావేళ్లా పడినా కనికరం చూపకుండా అధికార పార్టీ నేతలు చెప్పినట్టుగా పని పూర్తి చేసుకుని వెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డు సమీపంలో గత ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో పార్టీలు, కులాలకు అతీతంగా 1,060 మంది పేదలకు స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించారు. ఇదే లేఅవుట్‌లోనే రెండోవిడతలో 22 మంది అర్హులకు ఇంటి పట్టాలిచ్చారు.

వైఎస్సార్ సీపీ నేతలే టార్గెట్‌గా..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల కన్ను ఆ 22 ప్లాట్లపై పడింది. విలువైన వాటిని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ కొత్తచెరువు గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డే భాస్కర్ తల్లి రామలక్ష్మమ్మ, భార్య రమాదేవి పేరిట ఉన్న రెండు ప్లాట్లపై ఎక్కువగా దృష్టి పెట్టారు. రమాదేవి పేరిట ఉన్న ఇంటి పట్టాలో చిన్న తప్పు దొర్లింది. రామ్మోహన్ వైఫ్ ఆఫ్ భాస్కర్ అని నమోదైంది. దీన్ని సరిచేయాలంటూ గతంలోనే గ్రీవెన్సులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం ఆప్షన్ లేదని, రాగానే సరిచేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి..

భాస్కర్ తల్లి, భార్య పేరిట ఉన్న స్థలాల్లో ప్రస్తుతం ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఈ క్రమంలో వారిని ఎలాగైనా ఇబ్బంది పెట్టాలని భావించిన టీడీపీ నాయకులు.. అధికారులను రంగంలోకి దింపారు. ఇంటి పట్టాలోని చిన్నపాటి దోషాన్ని ఆసరాగా చేసుకుని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, కొత్తచెరువు సీఐ ఇందిర, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బుధవారం లే అవుట్‌లోని నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు చేరుకున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఇంటిని దగ్గరుండి మరీ కూల్చివేయించారు. బాధితులు కన్నీరు మున్నీరవుతూ కాళ్లావేళ్లా పడుతున్నా అధికారులు కనికరం చూపలేదు. పోలీసులను ఉసిగొల్పి వారిని బలవంతంగా పక్కకు ఈడ్చివేయించారు. జేసీబీ, కట్టెల సాయంతో రెండు గోడలు కూల్చివేయించారు.

పల్లె ప్రోద్బలంతోనే..

స్థానిక టీడీపీ నేతల ఒత్తిడితో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ప్రోద్బలంతో అధికారులు అన్యాయంగా తన ఇంటిని కూల్చివేశారని భాస్కర్ వాపోయారు. ప్రస్తుతం ఇక్కడ ఒక్కో ప్లాట్ రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర పలుకుతోందని, దీంతో వీటిని కబ్జా చేసి అమ్ముకోవాలని టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తాను ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని, టీడీపీ నాయకులు, అధికారుల దౌర్జన్యాలను ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.

ఇంటిని కూల్చటం క్షమించరాని నేరం..

తమ ప్రభుత్వ హయాంలో వేల మంది పేదలకు ఇంటి పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. గత సర్కార్ ఇచ్చిన స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం క్షమించరాని నేరమన్నారు. అధికారం ఎంతో కాలం ఉండదని టీడీపీ నేతలు గుర్తు పెట్టుకోవాలని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాలని హెచ్చరించారు. ఖరీదైన స్థలాలపై స్థానిక టీడీపీ నేతల కన్ను పడిందని, అందులో భాగంగానే ధర్మవరం రోడ్డు సమీపంలోని అర్హుల స్థలాలను లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటామని పార్టీ నేతలు దాల్ మిల్ సూరి, తలమర్ల మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, తదితరులు భరోసా ఇచ్చారు.





కొత్తచెరువు జగనన్న లే అవుట్‌లో భాస్కర్ నిర్మిస్తున్న ఇంటి గోడలను కూల్చి వేసిన దృశ్యం, కన్నీటి పర్యంతమవుతున్న భాస్కర్ కుటుంబ సభ్యులు, ఇదేం న్యాయమని ఆర్డీఓ సువర్ణను ప్రశ్నిస్తున్న భాస్కర్, వైఎస్సార్‌సీపీ నేతలు

సచ్చినా సెలవివ్వరా?

- ఎంపీడీఓ తీరుకు నిరసనగా వెల్ఫేర్ అసిస్టెంట్ ఆందోళన
- తీవ్ర అస్వస్థతతో స్పృహ తప్పి కింద పడిపోయిన వైనం
- అనంతపురం సర్వజనాస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న నరసింహ నాయక్

నల్లమాడ: ఆరోగ్యం బాగోలేదు.. సెలవు ఇవ్వాలని నెలరోజుల నుంచి ప్రాధేయ పడుతున్నా అధికారులు కనికరించకపోవడంతో ఓ సచివాలయ ఉద్యోగి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. ఓడీసీ మండలం కొండకమర్ల-1 సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్. నరసింహ నాయక్‌కు చాలా కాలం నుంచి నరాల సంబంధిత వ్యాధి ఉంది. ఇప్పటికీ మందులు వాడుతున్నారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స నిమిత్తం మెడికల్ లీవ్ మంజూరు చేయాలంటూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌ను నెల రోజులుగా వేడుకుంటున్నారు. అయినా ఆయన దాటవేస్తూ వచ్చారు. ఈ క్రమంలో బుధవారం రాబర్ట్ విల్సన్ నల్లమాడ మండల కార్యాలయంలో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి చేరుకున్నారు. ఆరోగ్యం సరిగా లేదని, మెడికల్ లీవ్ మంజూరు చేయాలని మరోసారి కోరారు. అయితే ఎంపీడీఓ సెలవు మంజూరు చేయకపోగా..బూతుపురాణం అందుకున్నారు. తీవ్ర మనస్తాపం చెందిన నరసింహ నాయక్ తాను సచ్చినా సెలవివ్వరా అంటూ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వెంటనే ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. అనంతరం సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ దాదాపీర్ కార్యాలయం వద్దకు చేరుకొని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు నచ్చజెప్పారు. పోలీసుస్టేషన్‌కు వచ్చి లిఖిత పూర్వక ఫిర్యాదు ఇవ్వాలని కోరారు. అయితే ఇప్పుడే వస్తానంటూ కారులో వైఎస్సార్ కూడలి వైపు వెళ్లిన నరసింహ నాయక్... కూడలి సమీపాన స్పృహ తప్పి పడిపోయారు. దీంతో ఆయన భార్య ధరణి స్థానికుల సాయంతో నరసింహ నాయక్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. దీనిపై ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

మద్యం.. మహిళల యుద్ధం

- ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం
- రోడ్డుపై బైఠాయించి నిరసన




రోడ్డుపై బైఠాయించిన మహిళలు, సర్దిచెబుతున్న ఎస్‌ఐ సోమశేఖర్

బత్తలపల్లి: కుటుంబాల్లో చిచ్చుపెట్టే మద్యం దుకాణాన్ని ఇళ్ల మధ్య ఏర్పాటు చేసేందుకు సిద్ధం కావడంతో మహిళలు యుద్ధానికి దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు . గృహాల మధ్య ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వకూడదంటూ నినదించారు. వివరాల్లోకి వెళితే... బత్తలపల్లిలో మూడు మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందులో రెండు దుకాణాలను తొలుత బత్తలపల్లి కూడలిలో ఏర్పాటు చేశారు. అయితే అక్కడ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమంటూ ధర్మవరం రోడ్డుకు మార్చారు. మరో దుకాణాన్ని తాడిపత్రి రోడ్డులో ఉన్న 'నాంది' వాటర్ ప్లాంటు సమీపంలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాతూరుకు చెందిన పలువురు మహిళలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రాంతంలో వేంకటేశ్వరాలయం, శివాలయాలు ఉన్నాయని, అలాగే వాటర్ ప్లాంట్ ఉండటంతో మహిళలు, పిల్లలు నిత్యం ఈ దారి వెంట వెళ్తుంటారన్నారు. ఇలాగే చుట్టూ ఇళ్లు ఉన్నాయన్నారు. ఇలాంటి ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల అందరికీ ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయకూడదని, కాదూ కూడదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. మహిళలు రోడ్డుపై బైఠాయించడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. ఏదైనా సమస్య ఉంటే అధికారులకు వినతిపత్రాల ద్వారా తెలపాలన్నారు. అంతేగానీ ఇలా రోడ్డుపై బైఠాయించడం పద్ధతి కాదన్నారు. దీంతో మహిళలు ఎస్‌ఐకి వినతిపత్రం అందజేశారు.

వీడియో చిత్రీకరిస్తూ బెదిరింపులు..

మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన మహిళలను కొందరు కానిస్టేబుళ్లు బెదిరించారు. మహిళలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ కేసులు పెడతామని బెదిరింపులకు దిగారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



గోరంట్లలో దంచేసిన వాన



పెడపల్లి వద్ద చిత్రావతి బ్రిడ్జిపై పారుతున్న నీరు

పుట్టపర్తి అర్బన్: ఫెంగల్ తుపాను ప్రభావం జిల్లాపై కొనసాగుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ జిల్లాలోని 5 మండలాల పరిధిలో భారీ వర్షం కురిసింది. గోరంట్ల మండలంలో అత్యధికంగా 136.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక పెనుకొండ మండలంలో 20.6 మి.మీ, సోమందేపల్లి 7.2 మి.మీ , హిందూపురం 5.6 మి.మీ, గుడిబండ 2.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

రోడ్లపై వర్షపునీరు

మంగళవారం రాత్రి గోరంట్లలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం నీరు రోడ్లపై భారీగా ప్రవహించింది. ఇళ్లలోకి నీరు చేరడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద నీరు భారీగా చేరడంతో చిత్రావతి మరోసారి జలకళ సంతరించుకుంది. గోరంట్ల నుంచి పెడపల్లి, రాయలవారిపల్లి, కోవెలగుట్టపల్లి మీదుగా పుట్టపర్తి నుంచి బుక్కపట్నం చెరువుకు నీళ్లు పారాయి.



క్లుప్తంగా

ఆయుధాల వినియోగంపై అవగాహన తప్పనిసరి

• ఎస్పీ రత్న



ఫైరింగ్ సాధన చేస్తున్న ఎస్పీ రత్న, ఏఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి అర్బన్: ఆయుధాల వినియోగంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలంటూ పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ రత్న సూచించారు. బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి సమీపంలోని ఫైరింగ్ రేంజ్ మైదానంలో ఐదు రోజులుగా జరుగుతున్న వార్షిక ఫైరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులతో కలసి పిస్టల్‌ను పేల్చి లక్ష్యాన్ని ఛేదించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేష్, , వెంకటేశ్వర్లు, శివనారాయణస్వామి, శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఆర్ ఆర్‌ఐలు మహేష్, వలి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు



వృద్ధుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడిని సకాలంలో పోలీసులు ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారు. బుధవారం ఉదయం పుట్టపర్తి మండలం గంటల మారెమ్మ గుడి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. గుడి వెనుక ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వృద్ధుడి వద్ద ఉన్న ఆధారాలను బట్టి గోరంట్ల మండలం సింగిరెడ్డి గ్రామానికి చెందిన ఎర్రోడుగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం అందిచంఆరు. అనంతరం 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తీసుకున్న చొరవకు ఈ సందర్భంగా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులకు విరివిగా రుణాలివ్వాలి

• కలెక్టర్ టీఎస్ చేతన్



జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: అర్హులైన రైతులు, చేనేత కార్మికులు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్రైమాసిక లక్ష్య సాధన ప్రగతిపై బ్యాంకర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హత కలిగిన వారందరికీ రుణాలు అందేలా చూడాలన్నారు. సంప్రదింపుల కమిటీ సమావేశంలో ప్రతి బ్యాంకు నుంచి ప్రతినిధి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. కరువు మండలాల్లో రుణాలు రీషెడ్యూల్ చేసేందుకు అన్ని మండలాలల్లోని రుణ ఖాతాల జాబితా సిద్ధం చేయాలన్నారు. నూతనంగా మంజూరు చేసిన చేనేత రుణాల జాబితాను సైతం అందజేయాలన్నారు. లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్‌తో సమన్వయం చేసుకుని చేనేతలకు విరివిగా రుణాలు మంజూరు చేయించాలని చేనేత, జౌళి శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని సాంఘిక సంక్షేమ పాఠశాలలకు కంప్యూటర్ సిస్టంలు, ఇ-క్లాస్ రూంల నిర్వహణకు బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంక్‌లలో రూ.10,255 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, రూ.17,970 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో చిన్న, సన్న కారు రైతులకు రూ.4,966 కోట్లు, ఎంఎస్‌ఎంఈ కింద రూ.730 కోట్లు, హౌసింగ్ కోసం రూ.20 కోట్లు, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రజలకు రూ.935 కోట్ల, పీఎం ముద్రా లోన్లు కింద రూ.238 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం రమణ కుమార్, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి పద్మక్క, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

సహజంగా సంభవించే విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్తుల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. విపత్తుల కారణంగా సంభవించే అనర్థాలపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు మరింత కీలకంగా పనిచేయాలన్నారు. వీసీలో ఎస్పీ వి.రత్న, జిల్లా పంచాయతీ అధికారి సమత, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్, ఇరిగేషన్ డీఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

కదిరి టౌన్: సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం కదిరిలోని లేబర్ ఆఫీస్ వద్ద బీడీ కార్మికులు ఆందోళన బాట పట్టారు. కార్యక్రమానికి సీఐటీయూ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా . సీఐటీయూ రాష్ట్ర నేత జి.ఓబులు మాట్లాడుతూ... రద్దు చేసిన బీడీ కార్మికుల సంక్షేమ చట్టాలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కదిరి పట్టణంలో ఐదు వేల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారని, వీరిలో 99 శాతం మంది ముస్లింలేనని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పనిచేయడం వల్ల శ్వాసకోశ, టీబీ, ఆస్తమా, నడుము నొప్పి, కంటి చూపు దెబ్బ తినడం లాంటి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీడీ కార్మికుల కోసం కదిరిలోనే ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ మొత్తాన్ని పెంచాలన్నారు. 60 ఏళ్లు దాటిన బీడీ కార్మికులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు టిడ్కో ఇళ్లను కేటాయించాలన్నారు. అనంతరం లేబర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.ఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, మున్ని, ఫాజిల్, బాబ్జాన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మాబున్నీషా, సుజాత, శారద, మాధవి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి పూలమొక్కను అందజేస్తున్న ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: ఏఆర్ డీఎస్పీగా నియమితులైన శ్రీనివాసులు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ విజయకుమార్‌ను పోలీసు ఉన్నతాధికారులు విశాఖకు బదిలీ చేసి ఆయన స్థానంలో అనంతపురంలో పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ)లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును నియమించారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు తీసుకుని ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే గుడిబండ ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న రాజకుళ్లాయప్ప కూడా ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. చిత్తూరు జిల్లా ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రాజకుళ్లాయప్ప ఇటీవలే బదిలీపై జిల్లాకు వచ్చారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

• ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

అనంతపురం టౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్‌ఈలు సంపత్‌కుమార్, సురేంద్రతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. జిల్లాలో విద్యుత్ మెటీరియల్ కొరత ఉందని, చాలా మంది డీడీలు చెల్లించి ఎదురు చూస్తున్నారని తెలిసిందని, 15 రోజుల్లో పరికరాలు సరఫరా చేస్తామని చెప్పారు. లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సైతం వేగవంతంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ సర్వీసుల కోసం రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతులు కోరిన సమయంలో విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ జేవీ రమేష్, ఏడీ శ్రీనివాసులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైలు నుంచి దూకి యువతి ఆత్మహత్య

• మెడిసిన్ సీటు రాకపోవడంతో అఘాయిత్యం
• మృతురాలు కర్ణాటకలోని కలబురిగి వాసి



తనూజ(ఫైల్)

రాయదుర్గం టౌన్: వైద్య కళాశాలలో సీటు దక్కకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువతి వేగంగా వెళుతున్న రైలు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని కలబురిగి (గుల్బర్గా) జిల్లా సేడం పట్టణానికి చెందిన కిషోర్‌కుమార్ కుమార్తె తనూజ (20) మంగళవారం ఉదయం చిత్రదుర్గం చేరుకుని అక్కడి వైద్య కళాశాలలో సీటు కోసం ప్రయత్నించింది. అయితే ఆమెకు సీటు దక్కకపోవడంతో అదే రోజు మధ్యాహ్నం బెంగళూరు నుంచి రాయదుర్గం మీదుగా హోస్పేట్‌కు వెళ్లే రైలులో తిరుగు ప్రయాణమైంది. ప్రయాణిస్తూనే తల్లిదండ్రులకు ఫోన్ చేసి తనకు మెడికల్ సీటు దక్కలేదని, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా తెలిపింది. అప్పటికే మధ్యాహ్నం 1 గంట. రాయదుర్గం శివారులోని పైతోట సమీపంలో వేగంగా వెళుతున్న రైలు నుంచి కిందకు దూకింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అయితే కుమార్తె ఫోన్ కాల్‌తో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పలు మార్లు కాల్ చేసినా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో విషయాన్ని వెంటనే కర్ణాటక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తనూజ సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా ఆమె ఆచూకీ కోసం కర్ణాటక పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పైతోట వద్ద గ్యాంగ్‌మెన్ నగేష్... పట్టాలు పక్కనే పడి ఉన్న యువతి మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి వద్ద లభించిన ఆధారాలను పరిశీలించి తనూజగా నిర్ధారించారు. అక్కడే పడి ఉన్న ఫోన్‌లోని నంబర్‌కు కాల్ చేసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుమార్తె మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు రాయదుర్గానికి ప్రయాణమైనట్లు సమాచారం. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత బలవన్మరణం



కుమారి (ఫైల్)

ధర్మవరం రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం దర్శనమల గ్రామానికి చెందిన అంకే ప్రసాద్, కుమారి (37) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిల్లర అంగడి ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం అనారోగ్యంతో ప్రసాద్ మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ కుమారిపై పడింది. జీవనోపాధి కోసం పెట్టుకున్న చిల్లర అంగడి కూడా సక్రమంగా జరగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న కుమారి మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి తలారి నాగరాజు ఫిర్యాదు మేరకు ధర్మరవం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, కుమారి ఆత్మహత్యపై స్థానికుల కథనం వేరుగా ఉంది. గ్రామంలో కుమారి గతంలో బెల్టు షాపు నిర్వహిస్తుండేదని, ఈ క్రమంలో తరచూ ఎక్సైజ్ పోలీసులు ఆమె ఇంటికెళ్లి మానసికంగా వేధింపులకు గురి చేస్తుండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వాస్తవాన్ని కప్పిపుచ్చుతూ మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామానికి చెందిన గోపి(27) ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి శాంతమ్మ తెలిపిన మేరకు... తనకున్న రెండు ఎకరాల పొలంలో ఇటీవల రెండు బోర్లు వేశాడు. ఇందు కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పులు తీర్చే మార్గం కానరాక బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మడకశిరలో దొంగల హల్‌చల్



మెడికల్ షాపు షట్టర్‌ను పైకెత్తిన దృశ్యం

మడకశిర: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఓ వాహనంలో వచ్చి పలు దుకాణాల్లో వరుస చోరీలకు పాల్పడ్డారు. ఎక్కువగా మెడికల్ షాపుల్లోనే చోరీకి పాల్పడడం విశేషం . తొలుత వైఎస్సార్ సర్కిల్‌లోని ఓ మెడికల్ షాపు షట్టర్‌ను ఇనుపరాడ్ల సాయంత పైకెత్తి లోపలకు చొరబడ్డారు. దాదాపు రూ.3లక్షల నగదు అపహరించారు. మరో మెడికల్ షాపులో చొరబడి రూ.లక్షల్లో నగదు చోరీ చేసినట్లు తెలిసింది. పెనుకొండ మార్గంలోని ఓ మెడికల్ షాపులోనూ చోరీ చేశారు. నగదుతో పాటు పలు మిషనరీ సామగ్రిని అపహరించుకెళ్లారు. బ్యాంక్ ఎదురుగా ఉన్న స్టీల్ పాత్రల షాపులో, అమరాపురం బస్టాండ్‌లోని ఓ ప్రొవిజన్ స్టోర్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. అనంతరం బేకరీలో చొరబడి నగదు అపహరించుకెళ్లినట్లు తెలిసింది. ఆయా ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

హిందూపురం అర్బన్: తాళం వేసిన ఇంటి తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలో పొట్టి శ్రీరాములు సర్కిల్ మధ్య వీధిలో నివాసముంటున్న పద్మావతమ్మ ఈ నెల 1న ఇంటికి తాళం వేసి తుమకూరులో జరిగే తన తండ్రి వైకుంఠ సమారాధన కార్యక్రమానికి వెళ్లింది. ఇంటికి వేసిన తాళాన్ని గుర్తించిన దుండగులు మంగళవారం రాత్రి తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బుధవారం తిరిగి వచ్చిన యజమానురాలు తలుపులు తీసి ఉండడం గమనిచంఇ లోపలకు వెళ్లి పరిశీలించింది. బీరువాలోని దుస్తులన్నీ చిందరవందర చేసి, లాకర్‌లో ఉన్న 200 గ్రాముల బరువున్న నాలుగు నెక్లెస్‌లు, బ్రాస్‌లైట్, కమ్మలు, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి, స్థానిక కౌన్సిలర్ రాఘవేంద్ర సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా... మహిళలకు తీవ్ర గాయాలు



గాయపడిన మహిళ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కనుముక్కల వద్ద బుధవారం ఆటో బోల్తాపడింది. ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... ధర్మవరం నుంచి కొత్తచెరువుకు ముగ్గురు ప్రయాణికులతో బయలుదేరిన ఆటో... కనుముక్కల గ్రామం దాటగానే అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఘటనలో నల్లమాడకు చెందిన ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెకు ఉపశమన చర్యలు చేపట్టారు. 108కు సమాచారం అందజేసినా... వాహనం రాకపోవడంతో గంట ఆలస్యంగా ఆమెను ఓ ప్రైవేట్ వాహనంలో ధర్మవరంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు శివన్న

పావగడ: స్థానిక పీఎస్ పరిధిలోని గంగసాగర్ గేట్ వద్ద చోటుచేసుకున్న ప్రమాదంలో మరిదాసనహళ్లికి చెందిన శివన్న (33) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం రాత్రి పావగడ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న శివన్నను ఎదురుగా వేగంగా వచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. శివన్నతో పాటు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న హనుమంతరాయప్ప, విద్యార్థి మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

13న అప్రెంటిస్‌షిప్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈనెల 13వ తేదీన కర్నూలులోని ఆర్టీసీ శిక్షణ కళాశాలలో ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ అకౌంట్ పాసుపుస్తకం జిరాక్స్ చేయించి ఓ సెట్ అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు కూడా వెంట తీసుకురావాలన్నారు. రూ.118 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 13వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే సర్టిఫికెట్లు పరిశీలిస్తామన్నారు. పూర్తి వివరాలకు 08518– 257025 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌జీఎస్‌ఏ నిధుల వినియోగంపై నేటి నుంచి శిక్షణ

అనంతపురం సిటీ: 'స్థానికీకరణ–సుస్థిర అభివృద్ధి లక్ష్య' సాధనలో భాగంగా రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ) నిధుల వినియోగంపై జెడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో గురువారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరుకానున్నారు. రెండ్రోజుల పాటు రెండు బ్యాచులకు శిక్షణ ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీహెచ్ఓలు, ఆర్‌డబ్ల్యూఎస్... పీఆర్ ఏఈలు, మండలానికి ఒకరు చొప్పున ఒక్కో మండలం నుంచి ఆరుగురు చొప్పున శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం ఆ తర్వాత ఈ నెల 10 నుంచి 19 వరకు మండలాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు వారు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

11న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



డీఈఓకు ధర్నా నోటీసు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: విద్యాశాఖ అధికారుల అశాస్త్రీయ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 11న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ధర్మవరంలోని ఉప విద్యాశాఖాధికారి కార్యాలయానికి వచ్చిన డీఈఓ కిష్టప్పను కలసి నోటీసును అందజేసి, మాట్లాడారు. మడకశిర మండలం అమిదాలగొంది జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జాబేజ్ సస్పెన్షన్, పాఠశాలల పని వేళలను సాయంత్రం 5గంటల వరకు పెంచడం, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ తదితర నిర్ణయాలు పూర్తి అశాస్త్రీయంగా ఉన్నాయన్నారు. కొన్ని మండలాల్లో ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదంటూ ఎంఈఓలు వేధిస్తున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సెలవులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రక్రియ మొత్తం బోధనకు ఆటంకంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆదివారాలు, పండుగ దినాల్లో సైతం పని చేయాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం సబబు కాదన్నారు. అశాస్త్రీయ నిర్ణయాలతో ఉపాధ్యాయులను వేధించడం మానుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 11న డీఈఓ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అలాగే 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర కౌన్సిలర్ మేరి వరకుమారి, జిల్లా కార్యదర్శి లతాదేవి, నాయకులు రామకృషానాయక్, హరికృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, సాయి గణేష్, బిల్లే రామాంజినేయులు, హరిశంకర్, వెంకటకిషోర్, బాలగొండ్ల ఆంజనేయులు, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ బుధవారం ఉదయం సిబ్బందితో కలసి తనిఖీలకు బయలుదేరారు. జాతీయ రహదారిపై గంటాపురం వద్దకు చేరుకోగానే ఎదురుపడిన ఇసుక టిప్పర్లను ఆపి, పరిశీలిస్తే ఎలాంటి అనుమతులు లేవని తేలింది. ఇసుక తరలింపుదారులు అనంతపురానికి చెందిన వారని నిర్ధారణ కావడంతో టిప్పర్లను సీజ్ చేసి, వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

అనంత జైలు సూపరింటెండెంట్ సస్పెన్షన్



కిషోర్‌కుమార్

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో పనిచేసి నాలుగు రోజుల క్రితం బదిలీపై వెళ్లిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ కారాగారంలో ఇటీవల పలు అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఎస్.కిషోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్‌గా ఎం.వెంకటేశ్వరరావు ఉన్నారు. నాలుగు రోజుల క్రితం బదిలీల్లో భాగంగా ఎస్.కిషోర్‌కుమార్ అనంతపురం ఓపెన్ ఎయిర్ జైల్‌కు, ఎం.వెంకటేశ్వరరావు నెల్లూరు కారాగారానికి వెళ్లారు. కాగా జైల్లో ఘటనలపై ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో జరిగిన పరిణామాలకు వారి నిర్లక్ష్యమే కారణమని నిర్ధారణ అయింది. దీంతో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. విశాఖ కేంద్ర కారాగారంలో జరిగిన సంఘటనలకు సంబంధించి మరికొందరిపై విచారణ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. విచారణ అనంతరం ఎవరెవరిపైన వేటుపడనుందో వేచి చూడాల్సిందే.

మార్కెట్ ధరకు కందుల కొనుగోలు

• జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం నిర్ణయించిన ధరకు జిల్లాలో రైతుల నుంచి కందులు కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందుల కొనుగోలుపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. వ్యవసాయ మార్కెటింగ్‌తో వ్యవసాయ అనుబంధ రంగాల శాఖల అధికారులు సమన్వయం చేసుకుని జిల్లా రైతుల నుంచి కందుల కొనుగోలుకు గురువారం నుంచి ఆర్‌ఎస్‌కేలలో నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. కేటాయించిన కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించేలా డీఆర్‌డీఏ పీడీ, డీసీఓ, డీసీఎంఎస్ అధికారులు చొరవ తీసుకోవాన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డీర్‌డీఏ పీడీ నరసయ్య, మార్కెటింగ్, డీసీఎంఎస్ అధికారులు పాల్గొన్నారు.